క్లుప్తంగా

చిల్డ్రన్స్ హోంకు రూ. 50 వేల విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

కడప కల్చరల్ : బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాసట చిల్డ్రన్ హోంకు శుక్రవారం దాతలు రూ. 50 వేల విరాళాన్ని అందజేశారు. స్థానిక ఎన్‌ఆర్‌ఐ వై.హర్షిత్ తల్లిదండ్రులు మంజుల, మనోహర్‌రెడ్డి చిల్డ్రన్స్ హోంలో పిల్లల అవసరాల కోసం హోం నిర్వాహకులు మేరువ బాలాజీరావు, బీపీ కార్తీక్‌రెడ్డిలకు రూ. 50 వేల నగదు అందజేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీ



బీఎస్‌ఎన్‌ఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం బీజేపీ అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ర్యాలీ చేపట్టి బీఎస్‌ఎన్‌ఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అన్ని వర్గాల ప్రజలు ఏకం అవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు జి. చంద్రశేఖర్, గాలి చంద్ర, దస్తగిరిరెడ్డి, అన్వేష్, గుంటి వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం, వెంకట శివ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా



విద్యుత్ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘు నాయకులు

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌లో విద్యుత్ సంస్కరణలు ఆపాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్ వద్ద వారు ప్లకార్డులు పట్టుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు పి. సుదర్శన్ రెడ్డి, ఎస్. శివశంకర్, పిసి క్రిష్టయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల చట్టాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో విద్యుత్ రంగ సంస్థలు, వినియోగదారులు, రైతులు పెద్ద ఎత్తున నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కెవి సురేంద్రబాబు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బీమా ఉద్యోగుల ప్రదర్శన



ప్రదర్శన నిర్వహిస్తున్న బీమా ఉద్యోగులు

కడప కల్చరల్ : కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించి రైతులను ఆదుకోవాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రధానవక్తగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ కనీస వేతనం చెల్లించి కార్మికులను, ఇన్సూరెన్స్ ప్రీమియంలపై, ఆహార పదార్థాలపై, ప్రాణాధార మందులపై జీఎస్టీ తొలగించి ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఏడాది క్రితం కేంద్ర ప్రభుత్వం ఒప్పుకున్న డిమాండ్లపై భారత రైతాంగం మళ్లీ పోరాటం చేయాల్సి రావడం బాధాకరమన్నారు. ఈ ప్రదర్శనలో యూనియన్ నేతలు వారిజాతమ్మ, అయ్యవార్ రెడ్డి, అమీనా పర్వీన్, శ్రీవాణి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: ఎస్‌టీఎఫ్ ఆవిర్భవించి సంవత్సర కాలం అయిందని ఇందుకు సంబంధించి ప్రథమ మహోత్సవ సభను జయప్రదం చేయాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. ఇందుకు సంబంధించిన వార్షిక విద్యాప్రగతి నివేదికను ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఆర్థిక బకాయిల గురించి, పీఆర్‌సీ, ఐఆర్‌ల గురించి మెరుగైన పీఆర్‌సీ వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ కడప యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశానికి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా

కడప కార్పొరేషన్: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని, పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.14.37లక్షల చెక్కులను షేక్ సబీన, వేముల రాజశేఖర్, కొత్త మధు బాబు యాదవ్, డి. లక్ష్మీ నరసమ్మ, పి. వెంకట లక్షుమ్మ, కొత్త భువనేశ్వరిలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష మాట్లాడుతూ... ఆరోగ్య శ్రీ పథకంలో ప్రస్తుతం రూ.5 లక్షల నుండి రూ.25 లక్షలకు పెంపు చేయడం గొప్ప విషయమన్నారు. కడప నగరంలో ఈ నాలుగేళ్లలో రూ. 8 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయం కింద ఇంత పెద్ద మొత్తంలో పేద ప్రజలకు సహాయం అందించడం గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షఫీ, జఫ్రుల్లా, కో ఆప్షన్ సభ్యుడు జహీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు త్యాగరాజు, వేణుగోపాల్ నాయక్, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

మేయర్ సురేష్ బాబు సేవలకు గుర్తింపు



సురేష్‌బాబును సన్మానిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ కె. సురేష్‌బాబు అందించిన సేవలకు సరైన గుర్తింపు లభించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అప్జల్‌ఖాన్ అన్నారు. వైఎస్సార్‌సీపీ కడప, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన సురేష్ బాబుకు ఆయన శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనతో కేక్‌ను కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అప్జల్‌ఖాన్ యువత ఫహాద్, శ్యామ్, డేవిడ్ పాల్గొన్నారు.

డీఎస్సీలో ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర సమన్వయకర్త ముమహ్మద్ అయ్యూబ్ కోరారు. ఈ విషయమై శుక్రవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాషను, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలను కడపలో కలిసి వినతిపత్రాలను సమర్పించారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం అంజాద్‌బాష కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సురేష్‌కుమార్‌కు ఫోన్ ద్వారా సమస్యను తెలియచేశారు. పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

డ్రాయింగ్ పోటీల పోస్టర్ల ఆవిష్కరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : రోల్ ఆఫ్ రోబోటిక్ టెక్నాలజీ ఇన్ ఫ్యూచర్ అంశంపై డ్రా యాన్ ఇమాజనరీ పిక్చర్ డ్రాయింగ్ కాంపిటీషన్‌కు సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాష ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక విద్యాసాగర్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత ప్రదర్శించేందుకు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నామ న్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు బాలాజీనగర్‌లోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పోటీలు ఉంటాయన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఇందులో మొదటి బహుమతిగా రూ. 7 వేలు, ద్వితీయ బహుమతి రూ. 5 వేలు, తృతీయ బహుమతిగా రూ. 3 వేలు, ప్రోత్సాహక బహుమతులు ఐదుగురికి రూ. 1000 చొప్పున అందజేస్తారన్నారు. ఆసక్తిగల వారు 17వ తేదీరాత్రి 8 గంటల్లోపు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

ఇతర వివరాలకు 94410 35961, 99665 63492 నెంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, కార్పొరేటర్ షఫీ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష తదితరులు

'మా నాన్నను చంపిన వారిని శిక్షించాలి'



విలేకరులతో మాట్లాడుతున్న పాలెం శ్రీకాంత్

కడప కోటిరెడ్డిసర్కిల్ : నా తండ్రి పాలెం యోగేంద్రరావును మానసికంగా వేధించి మనస్తాపానికి గురిచేసి అనవసరమైన ఒత్తిడిని తెచ్చి మరణానికి కారకులైన పాలెం గౌతమ్ చంద్రకాంత్, ఆయన సతీమణి క్రిష్ణ ప్రియ, సుదర్శన్ రెడ్డి, నజీర్, గడ్డం శ్రీనివాసులును కఠినంగా శిక్షించి మాకు న్యాయం చేయాలని పాలెం శ్రీకాంత్ కోరారు. కడప నగరం రైల్వే స్టేషన్‌రోడ్డులోని తమ నివాసంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. తన తండ్రి యోగేంద్రరావు ఈ నెల 15వ తేదీన మనస్తాపం, మానసిక రోదనతో మరణించాడని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న మా తండ్రిని అనవసరంగా ఒత్తిడి గురిచేసి చిత్రహింసలు పెట్టి, మానసిక క్షభకు గురి చేశారని తెలిపారు. మా తండ్రి మరణించడానికి పాలెం గౌతమ్ చంద్రకాంత్ మరికొందరు కారకులు అయ్యారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వాడకంతో ఆరోగ్యం

కడప అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వాడకంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రెండవ రోజు శిక్షణ కార్యకమంలో భాగంగా శుక్రవారం కేవీకేలో ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల సేకరణలో పాటించవలసిన పద్ధతులు, మేలైన యాజమాన్య పద్ధతులు గురించి గుంటూరుకు చెందిన ఏపీ రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణ అధికారి డాక్టర్ రవి తెలియచేశారు. అలాగే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త మానస వివిధ ఉద్యానవన పంటలలో ప్రకృతి వ్యవసాయ యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ గురించి వివరించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ వివిధ కషాయాల, పురుగు, తెగులు, నివారణ గురించి తెలియచేశారు. అనంతరం మామిళ్లపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతు బాలాజీ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి సాగు చేసిన వివిధ ఆకుకూరలు, పండ్ల తోటలను పరిశీలించారు. అలాగే వివిధ కషాయాల తయారీ పద్ధతుల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సాయి మహేశ్వరి, స్వామి చైతన్య, మహేష్‌బాబు పాల్గొన్నారు.



కషాయాల తయారీ గురించి వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ రైతు బాలాజీ

మట్కా బీటర్లు అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చెన్నూరు బస్టాండ్ వద్ద బ్రాహ్మణ వీధిలోకి వెళ్లే దారిలో ముగ్గురు మట్కా రాస్తుండగా శుక్రవారం సాయంత్రం ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వీరిలో షేక్ మౌలాలీ, షేక్ మహమ్మద్ అఫ్రోజ్ ఆలీ, షేక్ అమీర్ జాన్‌లు వున్నారు. వీరి వద్ద నుంచి రూ. 55,270 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంపు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని కేఎస్‌ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కొప్పర్తి గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ముగింపు క్యాంపు శుక్రవారంలో గ్రామంలోని ఆశ నిలయంలో నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమానికి స్టెప్ సీఈఓ సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులపాటు కొప్పర్తి గ్రామంలో స్పెషల్ ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ క్యాంపుతో గ్రామంలో పలు సమస్యలకు పరిష్కారం దొరికిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమకుమార్, ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి సురేష్‌బాబు పాల్గొన్నారు.

నూతన మసీదు ప్రారంభం

చింతకొమ్మదిన్నె : మండలంలోని మూలంక గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మసీదును శుక్రవారం కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేష్ రామాంజులురెడ్డి, బండి నిత్యానందరెడ్డిలు ప్రారంభించారు. అనంతరం మసీదు కమిటీ సభ్యులు వారికి శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.

జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాలు ప్రారంభం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్–9 ఆధ్వర్యంలో చింతకొమ్మదిన్నె మండలం శివాజీ నగర్లో ఏడు రోజుల ప్రత్యేక శిబిరం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్. షావల్లీఖాన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పరిధిలో అన్ని కాలేజీలలో కలిపి 71 ఎన్ఎస్ఎస్ యూనిట్లు మాత్రమే ఉండేవని అవి ఇవాళ 101 యూనిట్లకు అభివృద్ధి చెందడం గొప్ప విషయమన్నారు. వారం రోజుల క్యాంపులో ట్రాఫిక్, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రోగ్రాం ఆఫీసర్ కు సూచించారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 9 సేవలు ఆదర్శనీయమన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ శాఖ విభాగాధిపతి డాక్టర్ రెడ్డయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.



అలంఖాన్‌పల్లెలో ఎన్ఎస్ఎస్ క్యాంపులో డా. వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ వలంటీర్లు

డా. వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ ఆధ్వర్యంలో..

కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్–3 ఆధ్వర్యంలో అలంఖాన్‌పల్లెలో జాతీయసేవాపథకం క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ వి. రమాదేవి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అధికారుల ఆదేశాల మేరకు 7రోజుల పాటు ఈ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అభినందన



లిల్లీ సినీ యూనిట్ సభ్యులను సత్కరిస్తున్న జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు

కడప కల్చరల్ : 2023 సంవత్సరానికిగాను ఉత్తమ బాలల చలనచిత్రంగా ఎంపికైన లిల్లీ చిత్ర బృందాన్ని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం శుక్రవారం అభినందించింది. సంఘం అధ్యక్షులు, వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర అధికారభాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, ఇతర సభ్యులతో కలిసి కడప నగరంలోని వారి స్వగృహానికి వెళ్లి అభినందించారు. గత సంవత్సరం జులై 7న విడుదలైన లిల్లీ చిత్రాన్ని కడప నగరానికి చెందిన బాబురెడ్డి, జి.సతీష్‌కుమార్ నిర్మాతలుగా శివం దర్శకత్వంలో నిర్మించారు. బాబురెడ్డి కుమార్తె బేబి నేహా, సుబ్బారెడ్డి ప్రధాన పాత్రలుగా ఈ చిత్రం విడుదలైంది. ఈ సందరర్భంగా వారు బాబురెడ్డి, నేహా, వెంకట సుబ్బారెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు.

వైభవంగా వృషభాచలేశ్వరుడి ఊరేగింపు

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దులకొండలపై వెలసిన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రథసప్తమిని పురస్కరించుకుని ఆలయ చైర్మన్ కె.వెంకటేష్, ఆలయ ఈఓ శ్రీధర్‌ల ఆధ్వర్యంలో స్వామి వారిని గ్రామ వీధుల గుండా ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరినాథ శర్మ నేతృత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. అలాగే శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో ఆర్యవైశ్య ఆఫీసియల్స్ అండ్ ప్రొఫెసనల్స్ ఆసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన ఆనంత్ డైమండ్స్ వారి సౌజన్యంతో, ఆవోపా రాష్ట్ర మహిళా విభాగపు అధ్యక్షురాలు ఆరవేటి నిర్మల సహకారంతో ప్రచురించిన సకల దేవతల నిత్య పూజా విధానం అను పూజ గ్రంథాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవోపా మహిళా విభాగపు అధ్యక్షురాలు పి.ప్రవీణ, మహిళా విభాగపు అధ్యక్షురాలు బి.నాగలక్ష్మి, ఆవోపా, ఆవోపా మహిళా విభాగాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని నాగార్జున మోడల్ స్కూల్ వారికోత్సవ వేడుకలకు విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డితోపాటు ప్రముఖ సైకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లలితలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మన జిల్లాలో విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తున్న విద్యాసంస్థల్లో నాగార్జున విద్యాసంస్థ ఒకటన్నారు. సైకాలజీ ప్రొఫెసర్ లలిత మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా విజ్ఞానాన్ని సంపాదించాలంటే కృషి, పట్టుదల ఉండాలన్నారు. అనంతరం జాతీయస్థాయిలో వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందచేశారు. ప్రిన్సిపాల్ కృష్ణవేణి, సమీర, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

పోటెత్తిన భక్తజనం

కడప అర్బన్: దేవుని కడప బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శుక్రవారం రథసప్తమి పురస్కరించుకుని రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి జిల్లా వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. సాయంత్రం రథోత్సవం అంగరంగ వైభవంగా ముగిసింది. ఆ తర్వాత భక్తులందరూ తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో రాత్రి పొద్దుపోయే వరకు ట్రాఫిక్ స్తంబించింది. భక్తులు భారీ సంఖ్యలో రావడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు ఎక్కడివక్కడ ట్రాఫిక్‌లో స్తంభించి పోయాయి. చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో వన్‌టౌన్, చిన్నచౌక్ పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు కృషి చేశారు.



కడప అర్బన్: దేవుని కడప రహదారులలో స్తంభించిన ట్రాఫిక్

బ్రహ్మోత్సవంలో అన్నదానం

కడప కల్చరల్ : కడప రాయుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన రథోత్సవంలో పలువురు భక్తులు తమవంతు సేవలను అందించారు. స్థానిక భక్తుడు ఉక్కాయపల్లె రాజా తన మిత్ర బృందంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దాదాపు మూడు వేల మందికి విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామిపై భక్తితో 32 సంవత్సరాలుగా రథోత్సవంలో భక్తులకు అన్నదానం చేస్తున్నామన్నారు. అలాగే మాసాపేట సర్కిల్ నుంచి ఆలయం వరకు భక్తులు నీటి ప్యాకెట్లు, పానకం పంపిణీ చేశారు.

కడప ఎడ్యుకేషన్: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్‌ఖాదర్ బాషా ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.

కడప కార్పొరేషన్: దేవునికడప తిరుణాళ్ల సందర్భంగా స్థానిక పద్మావతి కళ్యాణ మండపంలో నగరపాలక సంస్థ ఉద్యోగుల అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ హాజరై భక్తులకు భోజనం వడ్డించారు. అన్నదాన కమిటీ సభ్యులు ఏ. శ్రీనివాసులు, ఏసీపీ నాగేంద్ర మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఉద్యోగుల ఆధ్వర్యంలో 19 సంవత్సరాలుగా రథసప్తమి రోజున అన్నదానం చేస్తున్నామన్నారు.



కడప కోటిరెడ్డిసర్కిల్: అన్నదాన ప్రాంగణంలో భోజనం తింటున్న భక్తులు



కడప కల్చరల్: భక్తులకు అన్నదానం చేస్తున్న ఉక్కాయపల్లె రాజా



కడప కార్పొరేషన్: భక్తులకు అన్నం వడ్డిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

ప్రజల వద్దకే సంక్షేమ పాలన

చింతకొమ్మదిన్నె : ప్రజల వద్దకే పాలనను అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ పి.నరేష్ రామాంజులురెడ్డిలు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొలుములపల్లి, తాడిగొట్ల, కొప్పర్తి గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను, విలేజ్ క్లినిక్‌లను వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్ర రాష్ట్రంలో చేసి చూపిస్తున్నాడన్నారు. పార్టీలకు కులాలకు మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా అందిస్తున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరిగేవారని, ప్రస్తుత ప్రభుత్వంలో ప్రభుత్వమే వలంటీర్ల ద్వారా ప్రజలకు అందాల్సిన అవసరాలు ఏమైతే ఉన్నాయో వాటిని తీర్చేందుకు ప్రతి గడప తట్టుతున్నారన్నారు. మళ్లీ సువర్ణ పరిపాలన రావాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం మనకు ఎంతైనా ఉందన్నారు. ప్రతి గ్రామపంచాయతీలలో ప్రజలు మండల కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామస్థాయిలోనే సచివాలయం ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మాజీ కన్వీనర్ గుత్తి రెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కష్టయ్య, ఎంపీటీసీలు ప్రసాద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగరాజు, సర్పంచులు సుబ్బరాయుడు, కోకటం లక్ష్మీనారాయణరెడ్డి, వర్దిరెడ్డి సురేంద్రారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గజ్జల ఈశ్వర్‌రెడ్డి, నాయకులు నాగమల్లారెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంధ్రనాథ్‌రెడ్డి

ప్రారంభమైన శ్రీవేంకటరమణుడి బ్రహ్మోత్సవాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పాత బస్టాండునందు వెలసిన శ్రీపద్మావతి సమేత కల్యాణ శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో శుక్రవారం అంకురార్పణతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. రథసప్తమిని పురష్కరించుకుని భక్తులు దేవదేవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఉభయదారులతో ప్రత్యేక పూజలు జరిపించారు. ముందుగా రథసప్తమి సందర్భంగా స్వామి వారిని సూర్యభగవానుడి అలంకారంలో పట్టణ పూలంగళ్ల సర్కిల్ వద్ద సూర్యప్రభ వాహనంపై స్వామివారిని ప్రత్యేక వాహనంలో కొలువుతీర్చి సూర్య ప్రతిబింబాలు పడేవరకు అక్కడే పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.